క్లుప్తంగా

తహసీల్దార్‌గా గురుప్రసాద్


బాధ్యతలు స్వీకరించిన గురుప్రసాద్

ఇచ్ఛాపురం రూరల్: మండల తహసీల్దార్‌గా సదాశివుని గురుప్రసాద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన ఎం.లావణ్య పదోన్నతిపై విజయనగరం జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారిగా బదిలీ అయ్యారు. దీంతో గతంలో తహసీల్దార్‌గా ఇచ్ఛాపురం, సోంపేట మండలాల్లో పనిచేసిన గురుప్రసాద్ రెండోసారి పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు ఎంపీపీ బోర పుష్ప, జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ, చాట్ల తులసీదాసురెడ్డి, కారంగి మోహన్‌రావు తదితరులు అభినందనలు తెలిపారు.

పౌష్టికాహారం అందజేత


రోగులకు పౌష్టికాహారం అందజేస్తున్న దృశ్యం

టెక్కలి రూరల్: టెక్కలి జిల్లా ఆస్పత్రి పరిధిలోని సుమారు 91 మంది టీబీ రోగులకు బుధవారం పౌష్టికాహారం అందజేశారు. డాక్టర్ రెడ్డీస్ ల్యాబరేటరీ సౌజన్యంతో రాగి పిండి, గోదుమ పిండి, బెల్లం, పాలు, అయిల్, శనగలు, కజ్జూరం, పెసలు తదితర వస్తువులు కలిగివున్న పౌష్టికాహార కిట్లను అందజేశారు. క్షయవ్యాధి నిర్మూలనకు ప్రభుత్వం చేపడుతున్న చర్యల్లో భాగంగా రోగులకు కిట్లు పంపిణీ చేస్తున్నట్లు డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డా.లక్ష్మీతులసి తెలియజేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి హెడ్ నర్స్ నీలవేణి, టీబీ యూనిట్ సిబ్బంది గిరి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

ఇచ్ఛాపురం రూరల్: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని పలు పాఠశాలల్లో బుధవారం ఆటల పోటీలు నిర్వహించారు. ఆటలతో పాటు క్విజ్, వ్యాస రచన, ఉపన్యాసం వంటి పోటీల్లో విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రత్యేక శ్రద్ధ అవసరం

టెక్కలి: పెంపుడు జంతువుల రక్షణపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని పశు సంవర్ధక శాఖ టెక్కలి డీడీ వి.జయరాజ్ అన్నారు. జంతు సంక్షేమ పక్షోత్సవాల్లో భాగంగా స్థానిక పశు వైద్య కేంద్రంలో పెంపుడు కుక్కలకు ఉచితంగా యాంటీ రాబీస్ వ్యాక్సిన్లు బుధవారం వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెంపుడు జంతువుల ఆరోగ్యంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వాటి నుంచి వివిధ రకాల వ్యాధులు వ్యాప్తి చెందుతాయని పేర్కొన్నారు. ముఖ్యంగా కుక్కల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏడీ రఘునాథరావు, వైద్యులు రమణ, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

హమాలీలకు పని భద్రత కల్పించాలి

కంచిలి: స్థానిక ఎంఎల్ఎస్ పాయింట్‌లో 38 ఏళ్లుగా విధులు నిర్వర్తిస్తున్న కళాసీలకు పనిభద్రత కల్పించి, నూతన కూలీ రేట్ల అగ్రిమెంట్ సత్వరమే అమలు చేయాలని హమాలీ వర్కర్స్ యూనియన్ సభ్యులు కోరుతున్నారు. గత 12 నెలలుగా నూతన అగ్రిమెంట్ అమలు చేయకుండా కాలక్షేపం చేయడంపై ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద బుధవారం నిరసన తెలిపారు. ప్రతీ రెండేళ్లకోసారి నూతన కూలీ రేట్లతో ఏర్పాటు చేసుకునే అగ్రిమెంట్‌ను ఈసారి ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. సమస్యలు పరిష్కరించకపోతే నిరసనలో పాల్గొంటామని హెచ్చరించారు.

విద్యుత్ బీసీ ఉద్యోగులకు విశాఖలో బిల్డింగ్


డైరీ ఆవిష్కరిస్తున్న మంత్రి సీదిరి అప్పలరాజు

సాక్షి, అమరావతి: విద్యుత్ బీసీ ఉద్యోగుల సంఘానికి విశాఖలో శాశ్వత భవన నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వ స్థలం కేటాయించేలా కృషి చేస్తానని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు హామీ ఇచ్చారు. విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం 17వ డైరీని బుధవారం విజయవాడలో ఆవిష్కరించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల విద్యుత్ కార్యాలయాల ఆవరణలో మహాత్మా జ్యోతీరావ్ పూలే విగ్రహాల స్థాపనకు, బీసీ ఉద్యోగులను కీలక పోస్టుల్లో నియమించడానికి, సాధారణ బదిలీల్లో అన్ని యూనియన్ల అసోసియేషన్లతో పాటు సమానంగా బీసీ యూనియన్ నాయకులకు ట్రాన్స్‌ఫర్ నుంచి మినహాయింపు కల్పించడానికి కూడా ప్రభుత్వం ద్వారా ప్రయత్నం చేస్తానని భరోసానిచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పరిశ వెంకటేశ్వరావు, జనరల్ సెక్రటరీ వి.అనూరాధ, వర్కింగ్ ప్రెసిడెంట్ ఉపేంద్రం శ్రీనివాసులు, వైస్ ప్రెసిడెంట్ గుణవంతుడు, అడ్వైజర్ చంద్రమౌళి, 13 ఉమ్మడి జిల్లాల కార్యవర్గ సభ్యులు, బీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఓటే వజ్రాయుధం


వజ్రపుకొత్తూరు: అవగాహన ర్యాలీ చేపడుతున్న దృశ్యం


ఇచ్ఛాపురం రూరల్: నూతన ఓటర్లు, బీఎల్‌వోలతో ర్యాలీ నిర్వహిస్తున్న డిప్యూటీ కలెక్టర్ సుమబాల


టెక్కలి: ఇందిరాగాంధీ జంక్షన్‌లో సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో మానవహారం చేపడుతున్న విద్యార్థులు


కాశీబుగ్గ: ఓటరు గుర్తు ఆకారంలో ఏర్పడిన విద్యార్థులు


కోటబొమ్మాళి: అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


కంచిలి: ప్రతిజ్ఞ చేస్తున్న తహసీల్దార్ హైమావతి తదితరులు


ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధంతో సమానమని వక్తలు పేర్కొన్నారు. పలాస, టెక్కలి, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఐదేళ్లకు ఒకసారి జరిగే ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవడం ద్వారా కోరుకున్న పాలనను తీసుకురావచ్చని పలువురు తెలియజేశారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటుహక్కు పొందే అవకాశాన్ని రాజ్యాంగం కల్పించిందని అవగాహన కల్పించారు. అర్హత కలిగిన ప్రతీ పౌరుడు ఓటుహక్కు పొందడం బాధ్యతగా గుర్తించాలని సూచించారు. ఓటుహక్కు నమోదు, ఓటుహక్కు వినియోగంపై ప్రత్యేక కార్యక్రమాలు, మానవహారాలు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్


నందిగాం: మానవహారం నిర్వహిస్తున్న రెవెన్యూ సిబ్బంది


టెక్కలి: మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి


కాశీబుగ్గ: ఓటు అక్షరాకృతిలో జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ క్యాడెట్లు


సోంపేట: సంస్కార భారతి విద్యాసంస్థల ఆవరణలో విద్యార్థుల ప్రదర్శన


సోంపేట: విద్యార్థులు వేసిన ఓటరు దినోత్సవ రంగవల్లిక


ఇచ్ఛాపురం: బస్టాండ్ కూడలిలో రెవెన్యూ సిబ్బంది మానవహారం

సస్యరక్షణ చర్యలపై అవగాహన


మాట్లాడుతున్న ఉద్యానశాఖ అధికారి మాధవీలత

కవిటి: రైతులకు సస్యరక్షణ చర్యలపై అవగాహన అవసరమని ఉద్యానవన శాఖ అధికారి పి.మాధవీలత అన్నారు. మండలంలోని కవిటి గ్రామంలో ఉద్యానశాఖ అధ్వర్యంలో అంతర పంటలైన జీడి మామిడి సంరక్షణ, కోకో సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జీడి మామిడిలో అధిక దిగుబడి పొందాలంటే లేత చిగురు దశ నుంచే జాగ్రత్తలు పాటించాలన్నారు. అంతర పంటగా కోకో సాగు చేయడం వల్ల అదనపు ఆదాయం పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సూర్యనారాయణ, వీఏఏ సమన్వి, ఎంపీఈవో విష్ణువర్ధన్, పూడి లక్ష్మణ్, పూడి నీలాచలం తదితరులు పాల్గొన్నారు.

'పక్కాగా సేవలు అందజేయాలి'


గృహ సారథులకు నియామక పత్రాలను అందజేస్తున్న జెడ్పీటీసీ దువ్వాడ వాణి తదితరులు

టెక్కలి: గ్రామ సచివాలయాల్లో పక్కాగా ప్రజలకు సేవలందించాలని జెడ్పీటీసీ దువ్వాడ వాణి అన్నారు. మండలంలోని బూరగాం, మేఘవరం, లింగాలవలస, పోలవరం గ్రామ సచివాలయాల్లో సిబ్బంది, వలంటీర్లు, సచివాలయాల పరిధి లబ్ధిదారులతో సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లోని అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థపై ప్రజలు పూర్తిస్థాయిలో సంతృప్తిగా ఉన్నారని పేర్కొన్నారు. అనంతరం గృహ సారథులకు నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎ.సరోజనమ్మ, సర్పంచ్‌లు ఎల్.సంజీవరావు, పి.ధనలక్ష్మి, మాజీ ఎంపీపీ సంపతిరావు రాఘవరావు, ఎంపీటీసీలు జె.జయలక్ష్మి, జె.మంగమ్మ, బి.కూర్మారావు, గ్రామ సచివాలయాల కన్వీనర్ల ఇన్‌చార్జి శిగిలిపల్లి మోహన్, నాయకులు జి.జోగారావు, జె.తిరుమల రెడ్డి, బి.ఢిల్లేశ్వరరావు, డి.లక్ష్మణరావు, బి.ధనుంజయ్, డి.కామన్న, ఎస్.హరినారాయణ, పి.తుపాన్, ఎస్.ఉమాపతి, ఆర్.శ్రీరామ్మూర్తి, జి.కమలాకర్, నందయ్య, డి.రామారావు, ఎం.విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

సత్తాచాటిన విద్యార్థినులు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు రాష్ట్రస్థాయిలో సత్తా చాటారు. ఈనెల 23, 24వ తేదీల్లో అన్నమయ్య జిల్లాలో జరిగిన అండర్–17 బాల్ బ్యాడ్మింటన్ బాలికల విభాగంలో పాఠశాలకు చెందిన ప్రియమణి, జ్యోత్స్నలు బంగారు పతకం సాధించారు. దీంతో జాతీయ స్థాయిలో ఆడేందుకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా వారికి ఉపాధ్యాయులు, గ్రీన్ ఆర్మీ అసోసియేషన్ సభ్యులు అభినందనలు తెలియజేశారు.

28న జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని కొండవూరులో ఈనెల 28 నుంచి జిల్లాస్థాయి కబడ్డీ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు సర్పంచ్ కొల్లి భాస్కరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆసక్తి కలిగినవారు 26వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు జట్టుపేరు నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 95428 87464, 70361 63416 నంబర్లను సంప్రదించాలని కోరారు.

బాలికలకు అవగాహన

కోటబొమ్మాళి: స్థానిక కేజీబీవీలో చదువుతున్న బాలికలకు పోలీసులు పలు అంశాలపై బుధవారం అవగాహన కల్పించారు. క్రమశిక్షణతో ఉత్తమ విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఎవరైనా ఇబ్బందులకు గురిచేస్తే ధైర్యంగా ఫిర్యాదు చేయాలని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో హెచ్‌సీ విశ్వేశ్వరరావు, కొత్తపేట సచివాలయ మహిళా పోలీసు స్వాతి, ప్రిన్సిపాల్ పి.వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా వాలీబాల్ పోటీలు

కవిటి: మండలంలోని బెజ్జిపుట్టుగ చక్రధర యువజన సంఘం అధ్వర్యంలో నిర్వహిస్తున్న వాలీబాల్ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. బుధవారం వాలీబాల్ పోటీలు రెండో రౌండ్ పూర్తి చేసుకొని లీగ్ దశకు చేరుకున్నాయి. పోటీలను సంఘం ప్రతినిధులు పర్యవేక్షిస్తున్నారు.

మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయం


రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

వజ్రపుకొత్తూరు: గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని వైస్ ఎంపీపీ తమ్మినాన శ్రావణి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు హనుమంతు వెంకటరావు దొర అన్నారు. మండలంలోని మహాదేవపురంలో గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు చొరవతో రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేసామన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ టి.సుశీల, సచివాలయ కన్వీనర్ టి.ప్రణీత్ కుమార్, వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి తమ్మినాన శాంతారావు, నాగేశ్వరరావు, బి.ప్రభాకర్ పాల్గొన్నారు.

రిపబ్లిక్ డే
రంగవల్లికలు

గణతంత్ర దినోత్సవం సందర్భంగా టెక్కలి సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో బుధవారం నిర్వహించిన రంగ వల్లికల పోటీలు ఆకట్టుకున్నాయి. సీనియర్ సివిల్ జడ్జి టి.హరిత, జూనియర్ సివిల్ జడ్జి చక్రవర్తి మల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో విద్యార్థినులు పెద్ద ఎత్తున హాజరై దేశభక్తి పెంపొందించేలా వివిధ రకాల ముగ్గులు వేశారు.

– టెక్కలి


విద్యార్థినులు వేస్తున్న ముగ్గులను పరిశీలిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి టి.హరిత, జూనియర్ సివిల్ జడ్జి చక్రవర్తి తదితరులు


ఆకట్టుకున్న సైనిక ముగ్గు


జాతీయ జెండా, సైనికుడు, రైతుల ముగ్గు

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

- జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ
- పాత్రకొండలో గడప గడపకూ మన ప్రభుత్వం

సోంపేట: ప్రజా సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. మండలంలోని పాత్రకొండ సచివాలయం పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి గత మూడున్నరేళ్లుగా ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పేద ప్రజలందరికీ న్యాయం జరుగుతోందని తెలియజేశారు. అర్హులందరికీ నిష్పక్షపాతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం స్థానికులను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో సోంపేట, కంచిలి ఎంపీపీలు డాక్టర్ నిమ్మన దాసు, పైల దేవదాస్‌రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు రౌతు విశ్వనాథం, రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ మద్దు రాజారావు, సర్పంచ్ ఖగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు నాగేశ్వరరావు, కో–ఆప్షన్ సభ్యుడు బినోద్ చంద్ర పండా, పార్టీ నాయకులు బేసి శ్యామ్, గోకర్ల ధర్మారావు, మోహనరావు, శిలగాన భాస్కరరావు, సనపల కిరణ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు


తన ఇంటికి దువ్వాడను ఆహ్వానించిన టీడీపీ సర్పంచ్ నానిరెడ్డి

- ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్
- గొల్లూరులో గడప గడపకూ మన ప్రభుత్వం

నందిగాం: రాష్ట్రంలోని అర్హులందరికీ నిష్పక్షపాతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని పెద్ద తామరాపల్లి సచివాలయ పరిధి గొల్లూరులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి గత మూడున్నరేళ్లుగా అమలు చేస్తున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. విద్య, వైద్యం, వ్యవసాయంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. స్థానికులను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సైలాడ లావన్న, జీరు లక్ష్మణ్‌రెడ్డి, రట్టి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మహాయజ్ఞం


శ్రీమద్భగవద్గీత మహాయజ్ఞం నిర్వహిస్తున్న దృశ్యం

మందస: మండలంలోని పిడిమందస, కుంటికోట, వీరగున్నమ్మపురం పరిధి భల్లూకగిరిపై శ్రీరామానంద యోగాశ్రమంలో భక్తిశ్రద్ధలతో శ్రీమద్భగవద్గీత మహాయజ్ఞం వారం రోజులుగా కొనసాగుతోంది. నిర్విషయానంద ఆధ్వర్యంలో 18 రోజుల పాటు మహాయజ్ఞం జరగనుంది. రోజుకు ఒక్కో గ్రామ ప్రజలు యజ్ఞాన్ని జరిపిస్తున్నారు. భక్తులకు అన్నదానం, ప్రతిరోజూ ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జిల్లా నుంచే కాకుండా ఇతర జిల్లాలు, ఒడిశా నుంచి సాధువులు, స్వాములు, మాతలు యజ్ఞంలో పాల్గొంటారు. యజ్ఞంలో భాగంగా బుధవారం జరిగిన కార్యక్రమాల్లో గాయత్రి ఛారిటబుల్ ట్రస్టు చైర్మన్ కొర్ల కన్నారావు, మాజీ ఎంపీపీ కవిత, ఆధ్యాత్మికవేత్తలు బెస్త కామేశ్వరరావు, కొర్ల హేమారావుచౌదరి, అగ్గున్న జయరాజు, రామారావు, కుంటికోట, వీరగున్నమ్మపురం సర్పంచ్‌లు దుంపల వైకుంఠరావు, కర్రి గోపాలకృష్ణ, సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరణ ఏఐఎస్ఎఫ్ విద్యార్థులు, నాయకులు

కాశీబుగ్గ: కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా విభజన హామీల సాధన కోసం ప్రజలందరూ ఐక్యంగా ఉద్యమించాలని విద్యార్థి, యువజన సంఘాలు పిలుపునిచ్చాయి. స్థానిక కాశీబుగ్గ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థి, యువజన సంఘాల సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.యుగంధర్, ప్రత్యేక హోదా సాధన సమితి జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, ఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ రవి, కార్యదర్శులు వై.మురళి, కె.శ్రీనివాసరావు తదితరులు మాట్లాడుతూ.. కేంద్రానికి వ్యతిరేకంగా రాష్ట్ర హక్కుల కోసం అందరూ ఐక్యంగా ఉద్యమించాలన్నారు. ఈనెల 25వ తేదీన ప్రారంభమై ఫిబ్రవరి 4వ తేదీన శ్రీకాకుళం జిల్లాకు చేరుతున్న ప్రత్యేక హోదా బస్సు సమర యాత్రను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కృష్ణ, వల్లభరావు, తిరుపతి, వెంకటరమణ, మోహన్, యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి


కాశీబుగ్గ: ఐసీడీఎస్ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

కాశీబుగ్గ: కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీలు కోరారు. ఈ మేరకు అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, ఎం.మంజులకుమారి మాట్లాడుతూ కనీస వేతనాన్ని రూ.26 వేలు చేయాలని కోరారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ, పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం చేయకుండా తాత్సారం చేస్తే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె.జ్యోతి, బి.ఇందుమతి, పి.పద్మావతి, తులసమ్మ, కృష్ణవేణి, పి.పద్మావతి, మల్లీశ్వరి, అలివేలితో పాటు అంగన్వాడీలు తదితరులు పాల్గొన్నారు.

మందస: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు వి.హేమావతి, ఎన్.హైమావతి, బి.శ్యామలాకుమారి, జి.రాజేశ్వరి, బి.హేమలత, టి.రాధమ్మ, ఉమాసుందరి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి సంగారు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్టాఫ్‌నర్స్‌కు వైద్య సిబ్బంది సీమంతం


స్టాఫ్‌నర్స్‌కు సీమంతం చేస్తున్న వైద్య సిబ్బంది

వజ్రపుకొత్తూరు: మండలంలోని వెంకటపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్టాఫ్‌నర్స్‌గా పని చేస్తున్న దాసుపురం రేవతికి గ్రీన్ ఆర్మీ అధ్వర్యంలో వైద్య సిబ్బంది బుధవారం ఘనంగా సీమంతం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రీన్ ఆర్మీ అధ్యక్షుడు బోనెల గోపాల్ మాట్లాడుతూ మహిళలకు మాతృత్వం దేవుడు ఇచ్చిన వరమన్నారు. తల్లీబిడ్డల ఆరోగ్యానికి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది అనురాధ, భావని, పూల కుమారి, శిల్ప, దివ్య తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక గ్రంథాలు పంపిణీ


ఆధ్యాత్మిక గ్రంథాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

సోంపేట: మండలంలోని సుంకిడి, కొర్లాం, బారువ తదితర గ్రామాల్లో త్రైత సిద్ధాంత హిందూ జ్ఞానవేదిక–ప్రబోధ సేవాసమితి అధ్వర్యంలో ఆధ్యాత్మిక గ్రంథాలను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి గీతాజ్ఞానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత హిందూ జ్ఞానవేదిక–ప్రబోధ సేవా సమితి అధ్యక్షుడు రామకృష్ణ, రామినాయుడు, గణపతిరావు, మోహనరావు, మజ్జిరాజు, బాస్కర్, సురపు నాయుడు, సురేష్, నాయుడు, తవిటి రాజు, కొండమ్మ, రామలక్ష్మి గౌరమ్మ తదితరులు పాల్గొన్నారు.